# సత్యవాక్కు

# The Word of Truth

## క్రైస్తవ మాసపత్రిక

SEPTEMBER - 2010

సంవత్సర చందా రూ. 50/-

# సత్యవాణి - క్రీస్తు సంఘము
# బైబిలు లెక్చర్‌షిప్

| | | |
|---|---|---|
| సమయం | : | 2010 అక్టోబరు 24 నుండి 28 వరకు |
| ఉదయం | : | 10 గంటలకు |
| మధ్యాహ్నం | : | 3.00 గంటలకు |
| రాత్రి: | | 7.00 గంటలకు |
| స్థలము | : | సత్యవాణి - క్రీస్తు సంఘము 7-9-35, సాంబమూర్తి వీధి రామారావు పేట, కాకినాడ - 533 004 |
| ప్రసంగీకులు | : | అమెరికా, ఇండియా దేశ సువార్తికులు |
| అంశము | : | "You Can be Sure" |

మీరు తప్పక రండి, భోజన వసతులు ఉచితం. మీరు, మీ సంఘస్థులు తప్పక వచ్చి ఆత్మీయ మేలు పొందండి. మీకు మా హృదయపూర్వక స్వాగతం.

వందనములతో
Bro రిక్కీ గూటం
Bro జాషువా గూటం

ఫోన్ నెంబర్ : 0884- 2363722, 2363697

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 31 | సెప్టెంబరు - 2010 | సంచిక - 2


## యెరూషలేము తట్టు నీ కిటికీలను తెరచి యుంచుము

(Keep your Windows Open toward Jerusalem)

బబులోను రాజగు దర్యావేషు కాలములో ముప్పది దినముల వరకు తన యొద్ద తప్ప ఏ దేవుని యొద్దను, మానవుని యొద్దను ఎవడును ఏ మనవియు చేయకూడదు; ఎవడైనను చేసిన యెడల వాడు సింహముల గుహలో పడద్రోయ బడునను శాసనమును జారీ చేసెను. "ఇట్టి శాసనము సంతకము చేయబడెనని దానియేలు తెలిసి కొనినను అతడు తన యింటికి వెళ్లి యథా ప్రకారముగా అనుదినము ముమ్మారు మోకాళ్ళుని, తన యింటి పైగది కిటికీలు యెరూషలేము తట్టునకు తెరువబడి యుండగా తన దేవునికి ప్రార్ధన చేయుచు ఆయనను స్తుతించుచు వచ్చెను" (దానియేలు 6:7-10). తత్ఫలితముగా దానియేలు సింహముల గుహలో పడవేయ బడెను. అయితే దేవుడు సింహముల నోళ్లు మూయించెను. గనుక అవి అతనికి ఏ హానియు చేయక పోయెను. దేవుని నామము చివరకు ఘన పరచబడెను.

క్రైస్తవుడైన ప్రతివాడు దానియేలు వలె ప్రార్ధన జీవితమును జీవించవలెను. ప్రార్ధన లేకుండ దేవుని ఆశీర్వాద

ములను మనము సంపూర్తిగా పొంద లేము. ప్రార్థన స్థానములో మనం మరొక దానిని యేమీ ఉంచలేము. అయితే ప్రార్థన అనగా యేమిటి ?

దేవుని బిడ్డ యైన క్రైస్తవుడు తండ్రి యైన దేవునితో సంభాషణ చేసే గొప్ప అవకాశమే ప్రార్థన, మరియు అతని హృదయాభిలాషను దేవునికి తెలియజేప్పే అవకాశము-ప్రార్థన, "సహోదరులారా, ఇశ్రాయేలీయులు రక్షణ పొందవలెనని నా హృదయాభిలాషయు, వారి విషయమై నేను దేవునికి చేయు ప్రార్థనయునై యున్న ది" యని అపొ.పౌలు పలికాడు (రోమా 10:1). దేవాలయమునకు వెళ్లిన సుంకరి, "దూరముగా నిలుచుండి ఆకాశము వైపు కన్ను లెత్తుట కైనను ధైర్యము చాలక రొమ్ము కొట్టు కొనుచు-దేవా పాపినైన నన్ను కరుణిం పుమని పలికెను" (లూకా 18:13).

ప్రార్థన కేవలం ధ్యానించుట మాత్రమే కాదు, లేదా ధ్యాన సంబంధమైన మనస్తత్వాన్ని మాత్రమే కలిగి యుండుట కాదు గాని, మన హృదయ తలంపులు మాటలతో దేవునికి విన్నవించుకొనుట ప్రార్థనలో జరగాలి. "నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును" అని యేసు ప్రభువు పలికారు (యోహాను 14:13). "మరియు మన మాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయు చున్నాము గనుక, మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరుకును" అని భక్తుడైన యోహాను వ్రాసాడు (1 యోహాను 3:22).

దేవుని గ్రంథమైన బైబిలును మనం చదువునప్పుడు దేవుడు మనతో మాట్లాడుచున్నాడు. అయితే మనం ప్రార్థన చేయునప్పుడు దేవునితో మాట్లాడుదుము.

**మనం ప్రార్థన చేయునప్పుడు దేవుని సుత్తించాలి**

అందుకే, "పరలోక మందున్న మాతండ్రీ,నీ నామము పరిశుద్ధ పరచబడును గాక! " యని ప్రార్థించుడని ప్రభువు తన శిష్యులకు నేర్పించారు (మత్తయి 6:9).ప్రార్థనలో మనం దేవునికి కృతజ్ఞత చెల్లించాలి. "ఎల్లప్పుడును సంతోషముగా ఉండుడి; యెడతెగక ప్రార్థన చేయుడి; ప్రతి విషయము నందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి" యని పౌలు చెప్పాడు (1 థెస్స 5:16-18).

**తరువాత ప్రార్థన చేయునప్పుడు మన తప్పిదములను, పాపములను దేవుని యొద్ద ఒప్పుకోవాలి:**

"మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగిన వాడును నీ[illegible]డును గనుక ఆయన మన పాప[illegible] క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1యోహాను 1:9). అంతే

కాదు ప్రార్థనలో మనం దేవునికి విజ్ఞాపన, యాచన చేయాలి, మనము మనుష్యులందరి కొరకు, రాజుల కొరకు, అధికారులందరి కొరకు విజ్ఞాపనములు, ప్రార్థనలు యాచనలు చేయాలి. ఇది మంచిదియు మన రక్షకుడైన దేవుని దృష్టికి అనుకూలము మైనది యునై యున్నది (1తిమోతి 2:1-3).

"అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును. తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును, వెదకు వానికి దొరకును, తట్టువానికి తీయబడును. మీలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగిన యెడల వానికి రాతి నిచ్చునా ? చేపను అడిగిన యెడల పామునిచ్చునా? మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి యీవులనియ్య నెరిగి యుండగా పరలోక మందున్న మీతండ్రి తన్ను అడుగు వారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవులనిచ్చును" అని యేసు ప్రభువు బోధించారు (మత్తయి 7:7-11). గనుక ప్రార్థనలో మన అవసరాలను దేవుని అడగాలి. అవి ఆయన చిత్త ప్రకారమును బట్టి యుండాలి.

అయితే ప్రార్థన చేయునప్పుడు దేవునికి తెలియజేస్తు మానవునికి బుద్ధిచెప్పుచున్నట్లుండ కూడదు.

ప్రార్థన చేయుటకై దేవాలయమునకు వెళ్లిన పరిసయ్యుడు నిలబడి "దేవా, నేను చోరులును, అన్యాయస్థులును, వ్యభిచారులునైన, యితర మనుష్యుల వలెనైనను, ఈ సుంకరి వలెనైనను ఉండనందుకు నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాను. వారమునకు రెండు మారులు ఉపవాసము చేయుచు, నా సంపాదన అంతటిలో పదియవ వంతు చెల్లించుచున్నానని" ప్రార్థన చేసెను. గాని దేవుడతని నీతిమంతునిగా తీర్చలేదని యేసు ప్రభువు చెప్పారు (లూకా 18:9-14).

మన స్వకీయ దురాశలను తీర్చుకొనుటకు ప్రార్థన చేయరాదు, భక్తుడైన యాకోబు ఇట్లు వ్రాయుచున్నాడు: "మీలో యుద్ధములును పోరాటములును దేని నుండి కలుగుచున్నవి? మీ అవయవములలో పోరాడు మీ భోగేచ్ఛల నుండియే గదా? మీరాశించు చున్నారు గాని, మీకు దొరుకుట లేదు; నరహత్య చేయుదురు, మత్సరపడుదురు గాని సంపాదించు కొనలేరు, పోట్లాడుదురు యుద్ధము చేయుదురు గాని దేవుని అడుగనందున మీకేమియు దొరుకదు, మీరడిగినను మీ భోగముల నిమిత్తము వినియోగించుటకై దురుద్దేశముతో అడుగుదురు గనుక మీకేమియు దొరుకుట లేదు" (యాకోబు 4:1-4).

మనకేమైనా ఆపద గాని,

విపత్తుగాని సంభవించినప్పుడే దేవునికి విజ్ఞాపన చేయుట ప్రార్థన కాదు. అన్నివేళలా, సుఖ దు:ఖముల యందు మనం దేవుని మరచిన యెడల, "మీకు కష్టమును దు:ఖమును ప్రాప్తించునప్పుడు నేను అపహాస్యము చేసెదను. అప్పుడు వారు నన్ను గూర్చి మొఱ్ఱ పెట్టెదరు గాని నేను ప్రత్యుత్తర మియ్యకుందును. నన్ను శ్రద్ధగా వెదకెదరు గాని నేను వారికి కనబడ కుందును" అని ఆయన సెలవిచ్చు చున్నారు (సామె 1:27,28).

దేవుడు మనలను యేమి చేయాలని కోరుకున్నారో, దాన్ని చేయకుండా తప్పించుకొనే మార్గము ప్రార్థన కాదు. మనం ప్రార్థించాలి, పనిచేయాలి. ఆయన చిత్తమును జరిగించాలి. "ప్రభువా, ప్రభువా అని పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశించడు గాని పరలోక మందున్న నా తండ్రి చిత్తము చేయువాడే ప్రవేశించును. ఆ దినమున అనేకులు నన్ను చూచి, ప్రభువా, ప్రభువా, మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములు వెళ్లగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు నేను మిమ్మును ఎన్నడును ఎరుగను, అక్రమము చేయువారలారా, నా యొద్దనుండి పొండని వారితో చెప్పుదును" అని యేసు ప్రభువు పలికారు (మత్తయి 7:21-23).

పలికిన మాటలనే పదేపదే వల్లించుట ప్రార్థన కాదు. ప్రభువు తన శిష్యుల కిచ్చినది ఒక మాదిరి ప్రార్థనే గాని, దానినే మనం వల్లించాలని ఆయన బోధించలేదు. దేవుడు శర్వశక్తి మంతుడని, సమస్తాన్ని ఎరిగి మన అక్కరలను తీర్చగలవాడని, ఆయన లేకపోతే మన ఉనికియే సాధ్యము కాదని, అన్నింటికీ మనం ఆయనపైనే ఆధారపడి యున్నామని గుర్తెరిగి ఆయన దగ్గర మనం దీనులమై యుండుటయే నిజమైన ప్రార్థన.

మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా
ఇప్పుడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక
కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.
- ఎడిటర్

# ప్రత్యక్ష సాక్షుల సాక్ష్యం

## (Eye Witness Testimony)

క్రొత్త నిబంధన సంఘటనల యదార్థతను పరిశీలించుటకుగాను నమ్మదగిన ప్రత్యక్ష సాక్షులు లేరని సందేహాశీలురు చెబుతారు. అయితే క్రొత్త నిబంధన త్వరిత కాలములోనే వ్రాయబడినట్లున్న తిరుగులేని రుజువులను ఇది వరకే గమనించాము.

**అపొస్తలులు ప్రత్యక్ష సాక్షులే :**

క్రొత్త నిబంధన ప్రకారము 12 మంది అపొస్తలులందరు యేసు యొక్క జీవితం, అద్భుతములు, మరణం, సమాధి, పునరుత్థానముల యొక్క ప్రత్యక్ష సాక్షులే. యేసుక్రీస్తు సిలువ వేయబడిన కొన్ని దినముల తరువాతే, పెంతెకొస్తు పండుగ దినమున అపొ. పేతురు "ఈ యేసును దేవుడు లేపెను; దీనికి మేమందరము సాక్షులము" అని ప్రకటించాడు (అపొ.కా. 2:32).

ఆనాటి నుండి అపొస్తలులందరు యేసు యొక్క జీవన్మరణ, సమాధి పునరుత్థానములను వారెక్కడికి వెళ్లినా అక్కడ ప్రకటించారు. వారిని బంధించి యూదుల సమాజమందిరపు పెద్దల యెదుట నిల్పబెట్టినప్పుడు పేతురు, "మీరు జీవాధిపతిని చంపితిరి గాని దేవుడు ఆయనను మృతులలో నుండి లేపెను; అందుకు మేము సాక్షులము". మీరు మ్రానున వ్రేలాడ వేసి సంహరించిన యేసును మన పితరుల దేవుడు లేపెను. ఇశ్రాయేలునకు మారు మనస్సును, పాపక్షమాపణను దయచేయుటకై దేవుడాయనను అధిపతిని గాను రక్షకుని గాను తన దక్షిణహస్త బలము చేత హెచ్చించియున్నాడు. మేమును దేవుడు తనకు విధేయులైన వారికి అనుగ్రహించిన పరిశుద్ధాత్మయు ఈ సంగతులకు సాక్షులమై యున్నామని" చెప్పెను (అపొ.కా. 3:15; 5:30-32). మరల "దేవుడాయనను మూడవ దినమున లేపి ప్రజలందరికి కాక దేవుని చేత ముందుగా ఏర్పరచబడిన సాక్షులకే, అనగా ఆయన మృతులలో నుండి లేచిన తరువాత ఆయనతో కూడ అన్నపానములు పుచ్చుకొనిన మాకే ఆయన ప్రత్యక్షముగా కనబడునట్లు అనుగ్రహించెను" అని అతడు చెప్పెను (అపొ.కా. 10:41).

ఇంచుమించు రెండు సంవత్సరముల తరువాత తార్సువాడైన సౌలుకు యేసు కనబడెను (1కొరింథీ 9:1;15:8). దమస్కుకు వెళ్లి అక్కడ నున్న క్రైస్తవులను బంధించి యెరూషలేముకు తీసికొని

వచ్చుటకు సౌలు వెళ్లుచుండెను. అకస్మాత్తుగా యేసును చూచిన తరువాత సౌలు క్రైస్తవులను హింసించుటమాని యేసేక్రీస్తని ప్రకటించుటకు మొదలు పెట్టెను పునరుత్థానుడైన క్రీస్తును గూర్చి సౌలు ప్రత్యక్షసాక్షియే. తార్సువాడైన సౌలు అన్యజనులకు అపొస్తలుడైన పౌలు ఆయెను.

**యోహాను కూడ ఒక ప్రత్యక్ష సాక్షియే :**

"మేమేది వింటిమో కన్నులారా ఏది చూచితిమో, ఏది నిదానించి కనుగొంటిమో, మాచేతులు దేనిని తాకి చూచెనో అది మీకు తెలియజేయు చున్నా మని" అతడు వ్రాసాడు (1 యోహాను 1:1).

**ప్రజలు చెప్పుట కిష్టపడతారు:**

క్రొత్త నిబంధన కాలము నాటి ప్రజలు నేడున్నవారి కంటే యేమీ భిన్నమైన వారు కాగు. వారు విన్నవాటిని గూర్చి కన్నవాటిని గూర్చి ఇతరులకు చెప్పుదురు. నిజానికి ఆ కాలమందు కంప్యూటర్లు, టి.వీలు, రేడియోలు మొదలైనవి లేనందున బహుశ వారు ఎక్కువే మాట్లాడి యుందురు. వారు యేసును గూర్చి చెప్పారు, చెప్పుకొన్నారు.

**మార్కు :**

యేసు గెత్సెమనే తోటలో పట్టబడిన ప్పుడు ఆయనతో కూడ యుండిన యౌవనస్థుడు జాన్‌మార్కు అని చెప్పుకొన వచ్చును. అతడు మార్కు సువార్త వ్రాసాడు. అతడిట్లు వ్రాసాడు : "తన దిగంబర శరీరము మీద నారబట్టవేసికొని యున్న యొక పడుచువాడు ఆయన వెంట వెళ్లుచుండగా వారతని పట్టుకొనిరి. అతడు నారబట్ట విడిచి; దిగంబరుడై పారిపోయెను" (మార్కు 14:51-52). ఈ పడుచువాడు మార్కు అయితే, అతడు ఒక ప్రత్యక్షసాక్షియే.

క్రీ॥శ 125లో పపియస్ అను సంఘనాయకుడు, పేతురు యొక్క సాక్షి కథనాన్ని లిఖించుటలో మార్కు ఏ విధమైన పొరబాటు చేయలేదని చెప్పాడు. అతడు చెప్పింది యేదీ పొరబాటు కాదు.

క్రీ॥శ 180లో ఐరేనియస్ అనునతడిట్లు వ్రాసాడు : "పేతురు యొక్క శిష్యుడును, తర్జుమాదారుడైన మార్కు పేతురు యేమేమి బోధించాడో దానిని లిఖితపూర్వకంగా మనకను గ్రహించాడు. పేతురు యొక్క ప్రత్యక్ష సాక్షి కథనాన్ని మార్కు వ్రాసాడు ".

**లూకా :**

క్రొత్త నిబంధనలో 3వ సువార్తను లూకా వ్రాసెను. అతడు యేసు యొక్క మరణ సమాధి పునరుత్థానముల ప్రత్యక్ష సాక్షికాదు. గాని అతడు అతి శ్రేష్ఠమైన చరిత్రకారుడు. యితరుల ప్రత్యక్ష సాక్ష్యాలను అతడు లిఖించాడు.

లూకా సువార్తను పరిచయం

చేస్తు అతడిట్లు వ్రాసాడు : ఘనత వహించిన థెయొఫిలా, ఆరంభము నుండి కన్నులారా చూచి వాక్య సేవకులైన వారు మనకు అప్పగించిన ప్రకారము మన మధ్యను నెరవేరిన కార్యములను గూర్చి వివరముగ వ్రాయుటకు అనేకులు పూనుకొన్నారు గనుక నీకు ఉపదేశింపబడిన సంగతులు నిశ్చయముగా జరిగినవని నీవు తెలిసికొనుటకు వాటన్నింటిని మొదట నుండి తరచి పరిష్కారముగా తెలిసికొని యున్న నేనును నీ పేరట వాటిని గూర్చి వరుసగా రచించుట యుక్తమని యెంచితిని" (లూకా 1:1-4).

యేసు యొక్క జననము, బాల్యము యొక్క వివరణను సవిస్తరముగా అతడు వ్రాసినందున లూకా యేసు తల్లియైన మరియ నుండి ప్రత్యక్షముగా సమాచారము సేకరించే యుంటాడు. గాబ్రియేలు దూత ఆమెకు ప్రత్యక్షమవడం, దూత చెప్పిన రీతిగనే మరియు గర్భము దాల్చడం, బాలుడైన యేసును పశువుల తొట్టిలో పరుండబెట్టడం, యేసుకు సున్నతి చేసి దేవాలయమునకు తీసికొని వెళ్లడం, ఆయన 12 ఏండ్ల వయసు నాడు యెరూషలేము దేవాలయములోని పండితులను తన ప్రజ్ఞతో ఆశ్చర్య పరచడం, ఇవన్నీ మరియ లూకాకు వివరించియే యుండును. ఈ సంగతులన్నిటికి లూకా ప్రత్యక్ష సాక్షికాడు. గాని అతడు యేసు తల్లియైన మరియ యొక్కయు, యేసు సోదరులైన యాకోబు, యూదాల యొక్కయు, మగ్దలేనే మరియ, వేరొక మరియ, సలోమి మరియు యేసుతో కలసి పయనించిన అనేకుల యొక్కయు, ఆయన ఖాళీ సమాధిని చూచిన వారి యొక్కయు ప్రత్యక్ష సాక్ష్యములను అతడు సేకరించి మనకు లూకా సువార్తలో లిఖించాడు.

అంతేగాక లూకా పౌలుతో సహా కలిసి ప్రయాణం చేసిన ప్రియుడైన వైద్యుడు. అపొస్తలుల కార్యములలో అతడు వ్రాసిన దానిలో ఎక్కువ అతడు ప్రత్యక్షముగా చూచినవే. అపొ.కా. 16:6-40; 20:6-38; 21:1-15; 27:1-44లలో అతడు అ సందర్భములో అక్కడ వున్న వ్యక్తిగా కన్పడతాడు. లూకా పౌలుతో రెండు సువార్త దండయాత్రలలో పాల్గొన్నాడు, అతనితో కలిసి రోమాకు ఓడలో పయనించాడు, మరియు పౌలు చెరసాలలో యుండగా అతనికి పరిచర్య చేసాడు. దమస్కు మార్గములో యేసు పౌలుకు ప్రత్యక్షమవడం గూర్చి పౌలు అనేకమందికి చెప్పుచుండగా అతడు పదే పదే విన్నాడు.

"పౌలు అనుచరుడగు లూకా తన గురువు చెప్పిన సంగతులను సువార్త గ్రంధముగా వ్రాసాడు" అని ఐరేనియస్ చెప్పాడు. తిరిగిలేచిన క్రీస్తును ప్రత్యక్షంగా

పౌలు చూచాడు. పౌలు యొక్క సాక్ష్యాన్ని లూకా గ్రంధస్థం చేసాడు.

**సువార్తలు కల్పనా కథలతో నిండియున్నావా ?**

అనేక పండితులు మార్కు సువార్త క్రీ॥శ 70లలోను, మత్తయి, లూకా సువార్తలు 80 సం॥లలోను. పత్రికలు క్రీ॥శ 90 సం॥లలోను వ్రాయబడెనని చెబుతారు. సందేహ శీలురైతే సువార్తలు క్రీ॥శ రెండవ శతాబ్ధములో వ్రాయబడెనని అందువలన వాటిలో అనేక కల్పిత కధలు చేర్చబడెనని చెబుతారు.

క్రీ॥శ 80 సంవత్సరముకు ముందే లూకా సువార్త వ్రాయబడెననుటకు బలమైన కారణమున్నది. పౌలు రోమాలో గృహ బందీగాయున్న సంఘటనతో అకస్మాత్తుగా అపొస్తలుల కార్యముల గ్రంధము ముగించబడెను. క్రీ॥శ 62వ సంవత్సరములో పౌలు విడుదల చేయబడెను గనుక అపొ. కార్యముల గ్రంధము ఈ సంఘటనకు ముందే వ్రాయబడి యుండవలెను. అపొ. కార్యములు, లూకా సువార్త రెండు భాగములుగా యున్నను అవి ఒకనిచే వ్రాయబడి యుండుట వలన లూకా సువార్త కూడా క్రీ॥శ 62కు ముందే వ్రాయబడెననుట సమంజసము. సువార్తలలో మార్కు సువార్త మొదట వ్రాయబడెనని అందరు అంగీకరిం తురు. మార్కు గనుక క్రీ॥శ 50లలో దానిని వ్రాసియుంటే, అది క్రీస్తు యొక్క మరణ సమాధి పునరుత్థానముల తరువాత 30 సంవత్సరముల లోపే వ్రాయబడెను. సరియైన రికార్డు మనకిచ్చుటకు ఆనాటికి సజీవులైయున్న అనేక ప్రత్యక్ష సాక్షులుండిరి. గ్రంధకర్త ఏమైనా కల్పించి వ్రాసియుంటే దానిని సరిదిద్దుటకు అనేక ప్రత్యక్ష సాక్షులుండిరి. సువార్త వాక్యము నోటి ద్వారా మొదట బోధింప బడి తదుపరి గ్రంధస్థము చేయబడెనని మనము గుర్తుంచుకోవాలి.

**ఆదిమ క్రైస్తవ పాటలు, విశ్వాస ప్రమాణములు :**

పౌలు తన పత్రికలను 40వ సంవత్సరమునకు ముందే, సువార్తలు వ్రాయబడక ఒక దశాబ్ధము ముందే వ్రాయుటకు మొదలిడెను. ఆదిమ క్రైస్తవుల పాటలు, విశ్వాస ప్రమాణము లను పౌలు తన పత్రికలలో జమ చేసెను. ఈ పాటలు, విశ్వాస ప్రమాణ వాక్యములు కావ్యరీతిలో యుండుటచే వాటిని మనం గుర్తించవచ్చును. సండెస్కూలులో పిల్లలు పాటలు కంఠస్థము చేసినట్లు నాటి క్రైస్తవులు మొదట్లో అన్నీ కంఠోపాటముగా వల్లించేవారు.

ఆదిమ సంఘము యొక్క ప్రాముఖ్య బోధలు కీర్తనలు రూపములో యుండేవి. ఈ కీర్తనలు పౌలు వ్రాసిన

పత్రికలలో మాత్రమే భద్రపరచబడి యున్నాయి. వాటియొక్క ఉదా : ఎఫెసీ 5:14; ఫిలిప్పీ 2:6-11; కొలస్స 1:15-20 మరియు 1 తిమోతి 3:16లలో చూడ వచ్చును. ఫిలిప్పీయులలో యున్న కీర్తన యేసుయొక్క దైవత్వాన్ని వక్కాణించు చున్నది. మరియు సమస్తాన్ని ఆయన ద్వారా సంధిచేసి కొనెనని అక్కడ చెప్పబడెను. మొదటి శతాబ్దములోని ఆదిమ క్రైస్తవులు క్రీస్తును గూర్చి ఎట్టి అభిప్రాయములు కలిగియుండిరో ఆ కీర్తనలు మనకు బయలు పరచు చున్నవి. ఆయన దేవుడని, ఆరాధన మూర్తియని వారు తలంచారు.

**1కొరింథీ 15:3-8 :**

పౌలు ఎత్తిచూపిన ప్రాముఖ్య విశ్వాస ప్రమాణము 1కొరింథీ 15:3-8లో యున్నది. అతడు ఒక ప్రాముఖ్య సంప్రదాయమును గూర్చి ఇక్కడ చెప్పాడు. ఖచ్చితమైన సంప్రదాయమునతడు వారికిట్లు తెలియజేసాడు : "నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని. అదేమనగా లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి బొందెను. సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను. ఆయన కేఫాకును, తరువాత పండ్రెండు గురికిని కనబడెను. అటు పిమ్మట ఐదువందలకు ఎక్కువైన సహోదరులకు ఒక్క సమయమందే కనబడెను. వీరిలో అనేకులు ఇప్పటి వరకు నిలిచియున్నారు. కొందరు నిద్రించిరి. తరువాత ఆయన యాకోబుకును అటు తరువాత అపొస్తలులందరికిని కనబడెను"

ఈ విశ్వాస ప్రమాణము యొక్క మొదటి భాగము (3-5 వచనములు) సంఘముగా కంఠస్థము చేయగల్గునట్లు పద్యరూపమున వ్రాయబడెను. తరువాత భాగములో (6-8వచనములు ) కేఫాను (అరమిక్ భాష) గూర్చి వ్రాసాడు. 'పండ్రెండుగురికిని' 'మూడవదినమున' అను మాటలు క్రీస్తు పునరుత్థానుడైన స్వల్ప కాలవ్యవధిలోనే వ్రాయబడినట్లు సూచించుచున్నవి.

ఈ విశ్వాస ప్రమాణాన్ని పౌలు ఎక్కడ ఎప్పుడు పొందెను? ఎవరి నుండి పొందెను? యేసు క్రీ॥శ 30లో సిలువ వేయబడియుంటే ఆయన క్రీ॥శ 32 లో పౌలుకు కనబడెను. మూడు దినముల తరువాత అతడు దమస్కులో అననీయ చేత బాప్తిస్మము పొందెను, సంఘమునకు పరిచయము చేయబడెను (అపో.కా.9: 19-20). క్రీ॥శ 35లో అతడు యెరూషలేములో అపొస్తలులతో కొంత సమయము గడిపెను (గలతీ 1:18-19). ఆ సమయములోనే క్రైస్తవ విశ్వాస

ప్రమాణాన్ని నోటి సంప్రదాయము ద్వారా అతడు పొందెను. అప్పటి కది సంఘములో వాడుకగా యుండెను.

**ముగింపు :**

మనము రుజువులను పరీక్షించుచుండగా, యేసు అను వ్యక్తి నిజానికి ఉండెనని, ఆయన జీవించి బోధించి, స్వస్థత పరచి ఇశ్రాయేలు దేశములో మొదటి శతాబ్దములో మరణించెనని గ్రాహ్యాముగుచున్నది. ఆయన సమాధినుండి తిరిగి లేచిన తరువాత వందలాది ప్రజలు ఆయనను కండ్లారా చూచారు, ముట్టుకొన్నారు. మృతిబొంది తిరిగి లేచిన క్రీస్తు తార్సువాడైన సౌలుకు దమస్కు మార్గమందు కనబడగా, క్రైస్తవుల హంతకుడైన యతడు క్రీస్తు యొక్క అపొస్తలుడైన పౌలుగా మారాడు.

క్రొత్త నిబంధనలోని భాగములు ఈ సంఘటనలు జరిగిన వెంటనే వ్రాయబడి యుండుటచేత, కల్పిత కృత్యములు దానిలో చేర్చబడుటకు వీలు లేదు.

– రిచర్డ్ ఏడీ.

**గమనిక ::**

**సత్యవాణి T.V. కార్యక్రమములను**
**ప్రతి బుధ, వారము సాయంత్రం 6:30 గంటలకు**
**రక్షణ ఛానల్ లోను, శనివారం ఉదయం 8 గంటలకు**
**ఆరాధన ఛానల్ లోను, ఆదివారం ఉదయం 5:30 గ॥ లకు**
**ఎ-1 ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం**
**6:00 గంటలకు శుభవార్త ఛానల్‌లోను చూడండి.**

సత్యవాక్కు మాస పత్రిక కావాలంటే
సంవత్సరమునకు 50/- రూ॥లు చెల్లించవలెను

# బెల్షస్సరు యొక్క పాపములు

## (The Sins of Bellshazzar)

బబులోను రాజైన బెల్షసరు నగరు గోడ మీద వ్రాయబడిన వ్రాతను ఆ దేశములోనియే జ్ఞానియు చదివి దాని భావమును రాజునకు తెలియ పరచలేని అసమర్థులైనందు వలన దానియేలు రాజునొద్దకు తీసుకొని రాబడెను. తండ్రియైన నెబుకద్నెజరు ద్వారా యెరూషలేము లోని ఆలయము లో నుండి తీసుకొని రాబడిన వెండి, బంగారు పాత్రలలో రాజైన బెల్షస్సరు ద్వారా విందుకు ఆహ్వానింపబడిన అధిపతులు, రాజులు, తన ఉపపత్నులు వెయ్యిమంది ద్రాక్షారసము పోసి త్రాగిరి. వారు బంగారు, వెండి, ఇత్తడి, ఇనుము, కఱ్ఱ, రాయి అను వాటితో చేసిన దేవతలను స్తుతించుచు త్రాగు చుండిరి (దాని 5:4).

ఈ విందు జరుగుచుండగా మానవ హస్తపు వ్రేళ్లు కనబడి దీపము దగ్గర "మెనే, మెనే, టెకేల్ ఉఫార్సీన్" అని వ్రాసెను. ఈ వ్రాతను చదివి దాని భావమును చెప్పగల సమర్థత దానియేలునకు మాత్రమే గలదు. ఆ వ్రాత భావమేమనగా "మెనే" అనగా దేవుడు నీ ప్రభుత్వ విషయలో లెక్క చూచి ముగించెను "టెకేల్" అనగా ఆయన నిన్ను త్రాసులో తూచగా నీవు తక్కువగా కనబడితివి. "ఉఫార్సీన్" అనగా నీ రాజ్యము నీయొద్దనుండి విభాగింపబడి మాదీయులకును, పారసీకులకును ఈయబడును (దాని 5:25-28). రాజు యొక్క జీవితమును పరమందున్న దేవుడు పరీక్షించిన తరువాత రాజ్యమును అతని యొద్ద నుండి తీసివేసెను.

బెల్షస్సరు యొక్క పాపములను గూర్చి (దానియేలు 18-23) వచనములలో మనము చదువుదుము. పరమందున్న దేవుడు మహార్ధశయు, రాజ్యమును, ప్రభావమును, ఘనతను తన తండ్రియైన నెబుకద్నెజరుకు ఇచ్చెను. అయితే అతడు మనసున అతిశయం చినందున దేవుడతని ప్రభుత్వమును అతని యొద్ద నుండి తీసివేసి అతని ఘనతను పోగొట్టెను, మహోన్నతుడైన దేవుని యొక్క సార్వభౌమత్వమును అతడు గ్రహించిన తరువాత దేవుని యెదుట దీన మనస్సు గలవాడు కాగా తన రాజ్యము నకు మరల వచ్చెను (దాని 4వ అధ్యాయము).

అతని కుమారుడైన బెల్షస్సరు ఈ విషయములన్నియు ఎరిగియుండియు కూడ అతడు తన మనస్సును అణచుకొనక మనసున గర్వించి పరలోకమందున్న ప్రభువు పై తన్ను తానే హెచ్చించుకొని, తానును, తన అధిపతులును, తన

రాణులును, ఉపపత్నులును దేవుని ఆలయ సంబంధమగు ఉపకరణములలో ద్రాక్షారసముపోసి త్రాగవలెనని తెచ్చి, యుంచుకొని వాటిలో త్రాగుచు, చూడనైనను, విననైనను, గ్రహింపనైనను చేత గాని వెండి, బంగారు, ఇత్తడి, ఇనుము, కఱ్ఱ, రాయి అను వాటితో చేయబడిన దేవతలను స్తుతించిరి. కాని తన ప్రాణమును, తన సకల మార్గము లును ఏ దేవుని వశమున నున్నవో ఆదేవునిని ఘనపరచలేదు (దానియేలు 5:22,23). అతని తండ్రి పరలోక మందున్న దేవునికి విరుద్ధముగ ప్రవర్తించిన విధానమును బట్టి కలిగిన పరిణామమంతయు ఎరిగి యుండియు కూడ దేవుని యెదుట అతని ప్రవర్తన దేవునికి అంగీకారముగ లేకుండుటయే బెల్షస్సరు యొక్క మొదటి పొరబాటు. తన యజమాని చిత్తమెరిగి యుండియు సిద్ధపడక, అతని చిత్తము చొప్పున జరిగింపక ఉండు దాసునికి అనేకమైన దెబ్బలు తగులును (లూకా 12:47) అని మన ప్రభువైనయేసు చెప్పుచున్నారు. మేలైనది చేయ నెరిగియుండియు ఆలాగు చేయనివానికి పాపము కలుగును (యాకోబు 4:17).

రాజైన బెల్షస్సరు చేసిన రెండవ పొరబాటు అతనిలో దీనమనస్సు లేక పోవుటయే. అతడు మనసున గర్వించి పరలోక మందున్న దేవుని ఆలయములో ఉపయోగించు బంగారు పాత్రలను ద్రాక్షారసము త్రాగుట కొరకు తెప్పించు కొని త్రాగిరి. నాశనమునకు ముందు గర్వము నడచునని మనము ఎరుగు దుము (సామెతలు 16:18). రాజైన నెబుకద్నెజరు దేవుని యెదుట దీన మనస్సు గలవాడై దేవుని మహిమ పరచి, ఘనపరచినందున తిరిగి తన రాజ్యము తనకు అప్పగింపబడెను. (దానియేలు 2:26-47;3:1-29; 4 :34-37). మన దేవుడు దీనమనస్సు గలవారిని ప్రేమించును. మన కొరకు ఆయన ఉచితముగ అనుగ్రహించుచున్న మేళ్లకొరకు, ఈవుల కొరకు ఆయన యెడల కృతజ్ఞత కలిగి మన జీవితము లలో ఆయనను మహిమ పరచి, ఘనపరచు వారిని ఆయన ఎంతో ప్రేమించును.

రాజగు బెల్షస్సరు చేసిన మూడవ పొరబాటు యేమనగా అతడు దేవుని మహిమ పరచక బంగారు, వెండి, ఇత్తడి, ఇనుము, కఱ్ఱ, రాయి అను వాటితో చేయబడిన దేవతలను స్తుతించుచు, ఘనత ,ప్రభావములు యే దేవుని వశమున నున్నవో ఆ దేవుని ఘనపరచి మహిమ పరచలేదు "యెహోవాను నేనే. ఇదే నానామము మరి ఎవనికిని నా మహిమను నేనిచ్చు వాడను కాను. నాకు రావలసిన స్తోత్రమును విగ్రహములకు చెంద

నీయను (యెష 42:8). దేవుడు విగ్రహారాధనను అసహ్యించుకొనును. ఐగుప్తు నుండి తిరిగి వచ్చుచున్న ఇశ్రాయేలీయులకు దేవుడిచ్చిన ఆజ్ఞ లలో మొట్ట మొదట ఆజ్ఞ యేమనగా, "నీదేవుడైన యెహోవాను నేనే. నేను తప్ప వేరొక దేవుడు నీకుండ కూడదు". ప్రతి మతములోను వారి వారి యొక్క నమ్మకమును బట్టివారు పూజించే దేవునిని వారి అనుదిన జీవితములలో మహిమ పరచుచుందురు. గౌరవ పాత్రులైన నాయకులకు వీధులు, నగరములు, విమానాశ్రయములు మున్నగు వాటికి వారి పేర్లను పెట్టుట ద్వారా వారిని గౌరవించుచుందురు. ఘనులైన నాయకుల యొక్క గౌర వార్థము వారి జన్మదినములకు ప్రభుత్వము వారు సెలవు దినముగా ప్రకటింతురు. భార్యలు, బిడ్డలు వారి భర్తలు, తండ్రుల గౌరవార్థము వారి పేర్లు పెట్టుకొందురు. "భూమి మీద నేనే నిన్ను మహిమపరచితిని".

యేసు ప్రభువు ఆయన యొక్క జీవిత విధానము ద్వారా ఈ భూమి పై ఆయన జీవించినపుడు ఆయన చేసిన పనులను బట్టియు, ఆయన జీవించిన జీవితము ద్వారాను తండ్రియైన దేవుని మహిమ పరచెను. ఆయన ప్రార్థించెను (యోహాను 17:4). "అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును నీవు పంపిన యేసు క్రీస్తును ఎరుగుటయే నిత్య జీవము". ఆయన పరిశుద్ధ నామమునకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుట ద్వారా ఆయన పరిశుద్ధ నామమును మహిమ పరతుము. ఆయన మరణము నుండి లాజరును లేపకమునుపు ఆయన కన్నులు పైకెత్తి "తండ్రీ ! నీవు నామనవి వినినందున నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించు చున్నానని" తండ్రియైన దేవునికి ప్రార్థించెను (యోహాను 11:41). యేసు తన శిష్యులకు ప్రార్థించుట నేర్పెను "తండ్రీ! నీనామము పరిశుద్ధ పరచబడుగాక, నీరాజ్యము వచ్చుగాక, నీ చిత్తము పరలోక మందు నెరవేరుచున్నట్లు భూమి యందును నెరవేరును గాక: మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మాఋణములను క్షమిం చుము, మమ్మును శోధనలోనికి తేక దుష్టుని నుండి మమ్మును తప్పించుము" (మత్త 6:9-13). స్తుతి, మహిమ, ఘనత, ప్రభావములు యెల్లప్పుడు దేవునికే కలుగును గాక. ఆమెన్ (మత్త 6:9-13). సెరాపులు సైన్యముల కధిపతియగు యెహోవా పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు; సర్వలోకము ఆయన మహిమతో నిండి యున్నదని గొప్ప స్వరముతో గాన ప్రతిగానములు చేయుచుండిరి (యెషయా 6:3). ఈ నాలుగు జీవులలో ప్రతి జీవికి ఆరేసి

రెక్కలుండెను. అవి చుట్టును రెక్కల లోపలను కన్నులతో నిండి యున్నవి. అవి భూత, వర్తమాన, భవిష్యత్కాలములతో నుండు సర్వాధికారియగు దేవుడునగు ప్రభువు పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు అని మానక చెప్పుచుండిరి (ప్రకటన 4:8). ఇరువది నలుగురు పెద్దలు సింహాసనమందు ఆసీనుడగు వాని యెదుట సాగిలపడి, యుగయుగములు జీవించుచున్న వాని యెదుట నమస్కారములు చేయుచు ప్రభువా మాదేవా! నీవు సమస్తమును సృష్టించితివి. నీచిత్తమును బట్టి అవి యుండెను. దానిని బట్టియే సృష్టింపబడెను గనుక నీవే మహి ఘనత, ప్రభావములు పొంద నర్హుడవని చెప్పుచు తమ కిరీటములను ఆ సింహాసనము యెదుట వేసిరి (ప్రకట 4:11). దేవదూతలందరు, నాలుగు జీవులు, ఇరువది నలుగురు పెద్దలు, పరలోక మందున్న నీతిమంతుల ఆత్మలు అన్నియు యెల్లప్పుడు దేవునికి స్తుతిగానములు చేయుచుండిరి. ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి అంత రిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచు చున్నది (కీర్తన 19:1) మనము దేవుని ఘనపరచి ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించునపుడు ఆయన నామము మహిమ పరచబడును.

మన ప్రభువైన యేసుక్రీస్తు పేరిట సమస్తమును గూర్చి తండ్రియైన దేవునికి యెల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు క్రీస్తు యేసు నందలి భయముతో ఒకని నొకడు లోబడి యుండుడి (ఎఫెసి 5:20) అని అపోస్తలుడైన పౌలు క్రైస్తవులందరిని హెచ్చరించుచున్నాడు. యెహోవా ఏలుచుండు స్థలములన్నిటిలోనుండు ఆయన సర్వకార్యములారా ఆయనను స్తుతించుడి (క్రీర్తన 103:22). దేనిని గూర్చి చింతపడకుడి గాని, ప్రతి విషయములోను ప్రార్థన, విజ్ఞాపనముల చేత కృతజ్ఞతాపూర్వకముగ మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. (ఫిలిప్పి 4:6). మరియు మాట చేతగాని, క్రియ చేతగాని, మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతస్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరట చేయుడి (కొలస్స 3:17). కాబట్టి ఆయన ద్వారా దేవునికి యెల్లప్పుడు స్తుతియాగము చేయుదము అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము (హెబ్రీ 13:15). ఇది మన యెడల దేవుని చిత్తమైయున్నది ప్రతి విషయములోను కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యేసు క్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము (1 థెస్స 5:16). యెహోవా నామమునందు తగిన మహిమ ఆయనకు చెల్లించుడి

నైవేద్యము తీసికొని ఆయన ఆవరణము లలోనికి రండి (కీర్తన 96:88).

ప్రతి క్రైస్తవుని మంచి జీవితము ద్వారా దేవుడు మహిమ పరచబడును. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోక మందున్న దేవుని ఘనపర చునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి. (మత్త 5:16). (రోమా 2:24). మీరు బహుగా ఫలించుట వలన నాతండ్రి మహిమ పరచబడును. ఇందు వలన మీరు నా శిష్యులగుదురు (యోహాను 15:8).

దేవుని మహిమ పరచని వానిని ఆయన నిర్దోషిగా ఎంచడు. దేవుని యెదుట ఎంతో నమ్మకమైన వ్యక్తి మోషేవాగ్దాన దేశములో ప్రవేశించ లేక పోవుటకు కారణము ఆయన నీళ్లకొరకు ఆ బండతో మాట్లాడుమని చెప్పినపుడు మోషే తన చేతిలో యున్న కఱ్ఱతో ఆ బండను కొట్టి ఆ ప్రజల దాహము తీర్చుటకు నీళ్లను రప్పించెను. అప్పుడు దేవుడైన యెహోవా మోషే, అహరోను లతో మీరు ఇశ్రాయేలీయుల కన్నుల యెదుట నా పరిశుద్ధతను సన్మానిం చునట్లు నన్ను నమ్ముకొనక పోతిరి. కనుక ఈ సమాజమునకు నేను వారికిచ్చిన దేశమునకు వానిని మీరు తోడుకొని పోలేరు ( సంఖ్యా 20:12). మరియు వారు దేవునిని ఎరిగియు ఆయనను దేవునిగా మహిమ పరచలేదు. కృతజ్ఞతాస్తుతులను చెల్లింపను లేదు. కాని తమ వాదనల యందు వ్యర్థులైరి (రోమా 1:21). నియమింపబడిన దినమందు హేరోదు రాజు వస్త్రములు ధరించుకొని న్యాయ పీఠము మీద కూర్చుండి వారి యెదుట ఉపన్యాసము చేయగా జనులు యిది దైవ స్వరమేగాని, మానవస్వరము కాదని కేకలు వేసిరి. అతడు దేవుని మహిమ పరచనందున వెంటనే ప్రభువు దూత అతని మొత్తెను గనుక పురుగులు పడి ప్రాణము విడిచెను. (అ.కార్యము 12:21-23). దేవుని పరిశుద్ధ నామమును మనము మహిమ పరచనిచో మనలను దేవుడు వెంటనే మొత్తిన యెడల మన జీవితగతి యేమిటి ? హేరోదు రాజు జీవితమును దేవుడు దృష్టించెను.

విశ్వాస వీరులందరివలె తమ జీవితములలో దేవునికి విధేయుల గుచూ, ఆయన ఆజ్ఞలను గైకొనుచు అన్ని విషయములలో నీతిగా జీవించిన యెడల మనము ఆయనను మహిమ పరచిన వారమగుదుము. అన్ని విషయములలో ప్రథమ స్థానమును మనము దేవునికిచ్చిన యెడల ఆయనను మహిమ పరచిన వారముగ యుందుము. కాబట్టి ఆయన రాజ్యమును, నీతిని మొదట వెదకుడి అప్పుడవన్నియు మీకు అనుగ్రహింప బడును (మత్తయి 6:33). మన మంచి క్రియల ద్వారా దేవుడు మహిమ పరచబడును. మరియు

మాట చేతగాని, క్రియచేత గాని మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరట చేయుడి (కొల్స 3:17).

మన అను దినజీవితములలో ఆయన ఆజ్ఞలకు విధేయులగుట ద్వారాను మనము దేవుని మహిమ పరచుదుము మన అనుదిన జీవితములో ఆయన ద్వారా పొందుచున్న మేళ్లన్నిటి నిమిత్తము ఆయన కు యెల్లప్పుడు స్తుతిచెల్లించుట ద్వారా ఆయనను మహిమ పరచి, ఘన పరచుదము. మన జీవితములలో అన్ని విషయములం దును ఆయనకు ప్రథము స్థానము ఇచ్చి మంచి ఫలములు ఫలించెదము. అట్లు కానిచో ఆయన మనలను, మన జీవితములను ఆయన త్రాసులో తూచినపుడు మనము నిష్ఫలులముగ యుందుము. మాకు కాదు యెహోవా, మాకు కాదు, నీ కృపా సత్యములను బట్టి నీ నామమునకే మహిమ కలుగును గాక. (కీర్తన 115 :1).

- కవిత గూటం

## యెహోవా కొండలకు దేవుడేగాని లోయలకు కాదా ?

(Jehovah is God of the Hills , but is he not of the valleys ?)

"యెహోవా సెలవిచ్చున దేమనగా - సిరియనులు యెహోవా కొండలకు దేవుడేగాని లోయలకుదేవుడు కాడని అనుకొందురు, అయితే నేను యెహోవానై యున్నానని మీరు తెలిసికొనునట్లు ఈ గొప్ప సమూహ మంతయు నీ చేతికి అప్పగించెదను" (1 రాజులు 20:28).

యెహోవా మరియొక విగ్రహ మైన దేవుడే యని సిరియా దేశస్థులు తలంచారు. సిరియనులకు ఒక్కో సంగతికి ఒక్కో దేవుడిని ఏర్పరచు కొన్నారు. ఉదాహరణకు వారికి ఎండకో దేవుడు, వానకో దేవుడున్నాడు. యెహోవా కొండలకు దేవుడు గాని లోయలకు దేవుడు కాదని వారను కొన్నారు. "సిరియా రాజు సేవకులు అతనితో ఈ లాగు మనవి చేసిరి. వారి దేవతలు కొండదేవతలు గనుక వారు మన కంటె బలవంతులైరి . అయితే మనము మైదాన మందు యుద్ధము చేసిన యెడల నిశ్చయముగా వారిని గెలుచుదుము" (1రాజులు 20:23). గనుక ఇశ్రాయేలీ యులు మైదానములో తమతో యుద్ధము చేయునట్లు సిరియనులు వారిని రెచ్చగొట్టిరి.

మైదానములలో యుద్ధము చేస్తే తాము జయిస్తామని సిరియనులు నమ్మారు ఏలయనగా వారి అంచనా ప్రకారము ఇశ్రాయేలీయుల దేవుడు కొండలకే దేవుడు గాని మైదానములకు కాదు!

దేవుని గూర్చి మనము కూడ తప్పుగా అంచనా వేస్తాము దేవుని విషయాని కొచ్చేసరికి సిరియనులవలె మనం అనేక విషయాల్లో తప్పుగా భావిస్తాము. మన జీవిత సందర్భాలకు సంఘటనలకు కొన్నింటికే మనం దేవుని పరిమితి చేస్తాము. ఉదాహరణకు మనం దేవుడు అనారోగ్యానికే దేవుడు గాని ఆరోగ్యానికి కాదనుకొంటాము. మన కేదైనా అనారోగ్యంగా యున్నప్పు డేమి చేస్తున్నాము ? మన ఆరోగ్యానికి దేవుడే కారకుడని ఎందుకు తలంచము. ఆయనకు ఎందుకు స్తుతి చెల్లించము? రోగము రాగానే దేవుని ప్రార్థిస్తాము, గాని ఆరోగ్యముగా యున్నప్పుడు ఆయనకు స్తుతిచెల్లించము. అనారోగ్యం గా యున్నపుడు మనకు దేవుడెంత కావాలో, ఆరోగ్యంగా యున్నపుడు కూడ మనకు ఆయన అంతకావాలి! ఏలయనగా "నాకు వేరుగా యుండి మీరేమియు చేయలేరని" యేసు చెప్పారు (యోహాను 15:5).

రెండవదిగా, దేవుడు కష్ట సమయాల్లో దేవుడేగాని, సుఖ సమయాల్లో కాదనుకొంటాము మనము కష్టాలను, సమస్యలను ఎదుర్కొనుచున్నపుడు సహాయం కొరకు దేవుని అభ్యర్థిస్తాము. గాని అంతా సుఖంగా యున్నపుడు ఆయనను గూర్చి ఎందుకు ఆలోచించము? ఆర్థిక విషయాల్లో అంతా సుఖంగా కొనసాగు చున్నపుడు దేవుని అవసరం మనకు ఇంకా ఎక్కువ యుండాలి. అంతా మంచిగా యున్నపుడు మానవుడు దేవుని మరచి పోయే లక్షణం గలవాడు. దేవుడు ఇశ్రాయేలీయులకు ఇట్లు హెచ్చరిక చేసారు: "మీరు మా సామర్థ్యము మా బాహు బలము ఇంత భాగ్యము మాకు కలుగ జేసెనని అనుకొందురేమో. కాగా నీ దేవుడైన యెహోవాను జ్ఞాపకము చేసికొనవలెను. ఏలయనగా ....... మీరు భాగ్యము సంపాదించుకొనుటకై మీకు సామర్థ్యము కలుగ జేయువాడు ఆయనే " (ద్వితీ 8:17-18). దీనిని మనం జ్ఞాపకం చేసికోవాలి.

మూడవదిగా, దేవుడు కొందరికి ఆదివారం ఉదయముననే దేవుడు గాని సాయంకాలమున కాదు . దేవునికి మనం స్తుతులు కృతజ్ఞతలు చెల్లించాలని ఆదివారం ఉదయం మనం జ్ఞాపకము చేసికొంటాము. ఉదయకాలపు ఆరాధనకు వెళ్తాము. గాని సాయంకాలపు వేళ ఆరాధనకు గైర్హాజరవుతాము. ఆయన ఆదివార సాయంకాలం దేవుడు కాదను కొంటాము. ఆదివార సాయంకాలం ఆయనకు మనం స్తోత్రంచెల్లింపతగదా?

ఆదివారం దినమంతయు, ప్రభువు దినమే. మన యిష్టానుసారంగా సమయాన్ని గడుపుటకు అది మన దినము కాదు, ప్రభువు దినము! అపొ.కా. 20:7 ఇట్లు చెప్పుచున్నది "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్లయున్నై యుండి వారితో ప్రసంగించుచు, అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడు చుండెను". క్రైస్తవులు ఆదివారం రాత్రి కూడుకొనిన మంచి ఉదాహరణ యిది.

నాల్గవదిగా, అనేకులు దేవుడు ఆదివారాన్నే దేవుడు గాని మిగతా రోజుల్లో కాదను కొంటారు! ఆదివారమున గాక, మిగతా రోజులలో మన వేష, భాషలను గూర్చి జాగ్రత్తగా యుంటున్నామా? వారంరోజులలో మన ప్రవర్తన ఎట్లుం టాది? ఆదివారం మాత్రమే సత్ప్రవర్తన కలిగి యుండాలని మన దేవుడు కోరు చున్నారా? 2 కొరింథీ 3:2లో పౌలు యేమీ చెప్పాడో తెలుసా? "మనుష్యులందరు తెలిసికొనుచు చదువుకొనుచున్న మా పత్రిక మీరే కారా?" యని అతడు చెప్పాడు. మనం అన్ని రోజులలో అందరికీ సజీవమైన మాదిరిగా యున్నాము, యుండాలి.

చివరిగా దేవుడు మరణమునకే దేవుడు గాని, జీవముకు కాదని మనం తలస్తాము. మనందరికీ మరణం తప్పక సంభవిస్తాది. గనుక అందరికీ దేవుడు అవుసరం. మనకు దేవుని సహాయం ఆదరణ అవుసరం. అయితే జీవించి యుండగానే దేవుని కలిగియుండాలనే కోరిక మనకు ఎంతో ఎక్కువగా యుండాలి. ఆయన శక్తి జీవమునకును భక్తికిని కావలసిన వాటన్నిటిని మనకు దయచేయుచున్నందున దేవుని గూర్చి నట్టియు, మన ప్రభువైన యేసును గూర్చినట్టియునైన అనుభవజ్ఞానము మనం జీవించి యుండగానే సమృద్ధిగా కలిగి యుండాలి (2 పేతురు 1:3). మానవుడు పరిపూర్ణుడుగా సంతుష్టిగా యుండడానికి దేవుడు సమస్తము దయచేసియున్నారు. అట్లయినపుడు సిరియనుల వలె దేవుని గూర్చి మనం అపోహలు ఎందుకు కలిగి యుండాలి? "నేను సమీపమున నుండు దేవుడను మాత్రమేనా? దూరమున నుండు దేవుడను కానా? నాకునకబడకుండా రహస్య స్థలములలో దాగగల వాడెవడైన కలడా? నేను భూమ్యాకా శముల యందంతట నున్న వాడను కానా? యిదే యెహోవా వాక్కు" (యిర్మి 23:23-24).

- జాన్ స్టీవ్

# మనకు మాదిరి యున్నంత వరకు
## (As long as we have the Pattern)

హెబ్రీయులను ఒక ఆరాధన స్థలము నిర్మించుమని దేవుడు కోరినప్పుడు, దాని నెట్లు నిర్మించాలో ఆయన వారికి ఖచ్చితమైన నిర్దేశాలిచ్చారు , ఏయే సామగ్రి వినియోగించాలో కూడ ఆయన వారికి తెలిపారు. ప్రత్యక్షపు గుడారపు కొలతలను, దానిలోని తెరలు చేయువారి సృజనాత్మకతకు ఆయన యేమియూ విడిచిపెట్టలేదు. వారు తుమ్మకర్రను వినియోగించాలి. గుడారమునకు నూలు వినియోగించాలి. వారు బంగారు, వెండి, ఇత్తడిని ఆయన సూచించిన పరికరములకు వాడాలి. ఆవివరములన్నియు పనివారి నిమిత్తం నిర్గమకాండములో భద్రపరచబడి యుండెను. అవినేటికిని యున్నవి. నిర్గమ 35-38 అధ్యాయములలో ఆవివరములన్నీ మనకు దొరుకుతాయి. ప్రత్యక్షపు గురడారమును తయారు చేయునప్పుడు "కొండమీద నీకు కనుపరచిన వాటి రూపముచొప్పున వాటిని చేయుటకు జాగ్రత్తపడవలెనని" దేవుడు మోషేకు ఖండితముగా ఆజ్ఞాపించారు (నిర్గమ 25:40). వారు ఆయన యిచ్చిన మాదిరి చొప్పున దాని నిర్మించగా దేవుడు వారి పనిని అంగీకరించి వారి నాశీర్వదించారు. "అప్పుడు మేఘము ప్రత్యక్షగుడారమును కమ్మగా యెహోవా తేజస్సు మందిరమును నింపెను" (నిర్గ 40:34).

ఒకవేళ ఆ ప్రత్యక్ష గుడారము అగ్ని వలనగాని, తుపాను వలన గాని, యుద్ధము వలన గాని నాశనము గావించబడితే ... ? హెబ్రీయులు ఏమి చేసి యుందురు? దాని జవాబు సూక్ష్మమైనది. నిర్గమకాండ గ్రంధము వారి చేతిలో యున్నంత కాలము, దాని మాదిరి దానిలో యున్నందున, ఆదిలోవలెనే ఆ మందిరమును తిరిగి నిర్మించగల్గుదురు గదా.

క్రీస్తు తన సంఘమును నిర్మించి దాని మాదిరిని క్రొత్త నిబంధనలో మనకు లిఖించి యిచ్చారు (మత్తయి 28:20). తన శిష్యులు, సంఘము దానిని మాదిరిగా గైకొన వలెనని ఆయన ఖండితముగా చెప్పారు (2 తిమో 1:13). దేవుడు మోషేకు చెప్పిన మాటలనే పరిశుద్ధాత్ముడు హెబ్రీ పత్రిక లేఖకుని ద్వారా మరల మనలను ఇట్లు హెచ్చరించారు "కొండమీద నీకు చూపబడిన మాదిరి చొప్పున సమస్తమును చేయుటకు జాగ్రత్త పడుము" (హెబ్రీ 8:5).

మూడవ శతాబ్దము వచ్చుసరికి సంఘమును గూర్చి దేవుడిచ్చిన మాదిరిని

ప్రజలు బాహాటముగా ఉల్లంఘించుటకు ఆరంభించారు. కొంత కాలానికి నెమ్మదిగా ప్రభువు యిచ్చిన బోధ, మానవుని చేతిలో నుండి బైబిలును కూడ తీసి వేయడం జరిగింది. గురువులు తప్ప సామాన్య మానవులు చదువ లేని లేటిన్ భాషలో అది తాళం వేయబడింది. భ్రష్టత్వములో మునిగి పోయిన రోమన్ కేథలిక్కుల ఏకైక ఆస్థిగా దానిని పరిగణించుట జరిగినది. ఎవరి దగ్గరైనా బైబిలు కనబడితే వారికిశిక్ష, జరిమానా విధించేవారు. ప్రజలు గ్రహించుకొనే భాషలోనికి దానిని తర్జుమా చేయడం నిషేధించబడింది.

ప్రొటెస్టాంటుల సవరణోద్యమము యొక్క బహుమతి యేమంటే, ప్రజల చేతిలోనుండి బైబిలును నిషేధించిన పోపు యొక్క అధికారమును వారు కూలద్రోసిరి. ఐరోపా అంతటిలోను ప్రతి దేశములోను ధైర్యశాలులు బైబిలును తమ భాషలోనికి తర్జుమా చేయబూనుకొనిరి. గూటెన్‌బర్గ్ కనుగొనిన అచ్చుయంత్రము వలన ప్రజలు పరిశుద్ధ గ్రంథమును కొనుక్కొనుటకు వీలుగా అనేక ప్రతులు ముద్రించబడేవి. క్రీస్తు స్థాపించిన సంఘము కలుషితము చేయబడి, మరుగైపోయినను సంఘమును గూర్చిన దైవిక మాదిరి ఇప్పుడు ప్రజల చేతిలో యున్నది. ఆగ్రంథమును జాగ్రత్తగా చదువుట ద్వారా పాడైపోయిన దానిని వారు మరల తిరిగి నిర్మించారు. దానిని పునరుద్ధరించుటలో దేవుని లేఖనములే కొలకర్రవలె యుండెను (ప్రక 11:1). దేవునిచే అంగీకరింపబడాలంటే, సంఘము లేఖనములలో ఇయ్యబడిన ప్రమాణ ప్రకారముండాలి.

దేవుని మహాకృపను బట్టి ప్రపంచమంతటా క్రీస్తు సంఘము పునర్ధరించబడుచున్నది. ఆదిలో వలెనే దాని ఆరాధన, దాని విశ్వాసము, ఆచరణ అంతా వాక్యానుసారముగా పునరుద్ధరింపబడుచున్నది. నేడు మనకు దేవుని మాదిరి యున్నది. దేవుని దీవెనలు కాంక్షించువారు అన్ని సంగతులు ఆయన యిచ్చిన మాదిరిని బట్టి యుండేలాగున చూస్తారు. ప్రత్యక్ష గుడారమునకు విచిత్రమైన పనులను కల్పించుటకు ఏర్పరచబడిన బెసలేలును, అహోలీయాబును తమ స్వేచ్ఛ ప్రకారము పనిచేసినట్లయితే దేవుడు వారికేమి చేసి యుండునో గదా! ఆలోచించు.

– జాన్ వాడీ

# జాగ్రత్త !

నీ ఆలోచనలు జాగ్రత్త, అవి నీ మాటలగును
నీ మాటలను గూర్చి జాగ్రత్త అవి నీ క్రియలగును
నీ క్రియలను గూర్చి జాగ్రత్త అవి నీ అలవాట్లగును
నీ అలవాట్లను గూర్చి జాగ్రత్త అవి నీ ప్రవర్తనయగును
నీ ప్రవర్తనను గూర్చి జాగ్రత్త, అది నీనిత్య గమ్యమగును!

"తన్ను తాను ఎంచుకొన దగిన దానికంటే ఎక్కువగా ఎంచుకొనక దేవుడు ఒక్కొక్కనికి విభజించి యిచ్చిన విశ్వాస పరిమాణ ప్రకారము తాను స్వస్థ బుద్ధిగలవాడగుటకై తగిన రీతిగా తన్ను ఎంచుకొన వలెను" (రోమా 12:3).

"తననోరు కాచుకొను వాడు తన్ను కాపాడుకొనును. ఊరకొనకమాటలాడు వాడు తనకు నాశనము తెచ్చుకొనును" (సామె 13:3).

"హృదయ మందు నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడును..... మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్ప వలసి యుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పునొందుదువు. నీమాటలను బట్టియే అపరాధివని తీర్పునొందుదువు" (మత్తయి 12:34-37).

"ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు. అయితే తుదకు అది మరణమునకు త్రోవ తీయును" (సామె 14:12).

"తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే, చెడ్డ వైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరము క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీ 5:10). "మోసపోకుడి, దుష్టసాంగత్యము మంచినడవడిని చెరుపును. నీతి ప్రవర్తన గలవారై మేల్కొని పాపము చేయకుడి" (1కొరింథీ 15:33-34).

## మీ కొరక గొప్ప సదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును . గాని మీరు 85/- రూ॥లు మాత్రమే. మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిలు విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి:

***Satya Vani***

**#7-9-35, Sambamurty Street,**
**Kakinada - 533 004. Ph: 0884- 2363722**

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2009-2011

To

From:

**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004